క్లుప్తంగా

తాటి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: ఆదివాసీ సేన నాయకుడు ఊకే రవిని అంతు చూస్తా అని బెదిరించిన ట్రై కార్ మాజీ చైర్మన్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మీద చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన మండల కన్వీనర్ కొర్సా నరేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఆదివాసీ సేన ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉకే రవి, సేన అనుచరుల మీద ఏ మాత్రం గీత పడ్డా రెండు రాష్ట్రాల ఆదివాసీ సేన సంఘ నాయకులు సహించేది లేదని స్పష్టం చేశారు. బెదిరించే హేయమైన చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కారం రమేష్, శివ, నాగరాజు భాస్కర్, శ్రీను, వీరభద్రం, సోడి శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

అశ్వాపురం: ముస్లిం మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్ పాషా అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ వారి కళ్యాణ మండపంలో ఆదివారం ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకొని యాకూబ్‌పాషా చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో యాకూబ్‌పాషాను ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌కే.బషీర్, ఎండీ.అబ్దుల్‌అజీజ్, గౌరవ అధ్యక్షుడుగా ఎస్‌డీ.మస్తాన్, ఉపాధ్యక్షుడుగా అబ్దుల్‌బారి, జాయింట్ సెక్రటరీగా జానీపాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాజిబాబా, వెల్ఫేర్ సెక్రటరీగా ఎస్‌కె.సత్తార్, ఆఫీస్ బేరర్‌గా ఎండి.అమర్, కోశాధికారిగా ఎండి.లబ్దుల్‌అహ్మద్, సలహాదారులుగా ఏడుగురు, పదహారు మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న సమ్మె

మణుగూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కార్మికులు కంపెనీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మెకు సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు రోజులుగా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కార్మికులు సమ్మె చేస్తున్న కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కుటుంబరావు, వజ్జా వెంకటేశ్వర్లు, కార్మికులు ఎర్రయ్య, యాకయ్య, రాములు, అశోక్, బాబురావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలోని శేషగిరినగర్‌కు చెందిన సుమారు 600కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యంబాబు, అడపా అప్పారావు, ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి నవీన్, రామిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ టెస్ట్

మణుగూరురూరల్: మణుగూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్, భద్రాద్రి జిల్లా నేషనల్ స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో సీఆర్ రావు అడ్వాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్ వారిచేత ఆదివారం 13వ నేషనల్ ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో స్రవంతి, సువర్ణ, నరసింహారావులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించగా.. కార్యక్రమానికి భారతి సెక్యూరిటి సర్వీసెస్ ఎండి.చింతపల్లి జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచిన మీర్జాపురం ప్రతాప్ యూనివర్సిటీ, హైదరాబాద్ వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను భారతి సెక్యూరిటి సర్వీసెస్ ఎండి.చింతపల్లి జగన్ శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఏసీడీ' రద్దు చేయాలి

అన్నపురెడ్డిపల్లి: విద్యుత్ సంస్థలు వినియోగదారులపై విధించిన ఏసీడీ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని టీపీసీసీ మెంబర్, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి డిమాండ్ చేశారు. ఎర్రగుంటలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలిగించాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎర్రగుంట గ్రామంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ గత ఏడు నెలలుగా వెలగడం లేదన్నారు. సంబంధిత ఏఈతో సమస్యపై మాట్లాడగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గుంపెన సొసైటీ డైరెక్టర్ దావా రామయ్య, చల్లా పుల్లయ్య, వేముల కోటేశ్వరరావు, ఎండీ అహ్మద్, ఇనుగంటి ప్రసాద్, అజీజ్, గోళ్ల ముత్తయ్య పాల్గొన్నారు.

కరెంటు కోతలతో వెతలు

- సమయపాలన లేకుండా పవర్ కట్
- పొలాల వద్ద రైతుల పడిగాపులు
- పంటలు ఎండే దశకు చేరాయని ఆవేదన
- సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



విద్యుత్ సరఫరా లేక వెలవెలబోతున్న బోర్లు



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

దుమ్ముగూడెం: 'వ్యవసాయానికి 24గంటలు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా సాగుకు ఉచిత విద్యుత్ అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిపాం'అని సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల ప్రతిబింబించడం లేదు. పరిస్థితి వేరే విధంగా ఉంది. మండలంలో గతేడాది వర్షాకాలంలో వచ్చిన గోదావరి వరదల నుంచి విద్యుత్ సమయానికి రాక ఎప్పుడొస్తుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
మండలంలోని కేశవపట్నం ఫీడర్, నర్సాపురం ఫీడర్ల పరిధిలోని రైతులు మిర్చి, పత్తి, మినుము, మొక్కజొన్న, వరి పంటలను సాగుచేస్తుంటారు. పంటలు చేతికందే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ సకాలంలో ఆశించిన మేరకు అందడం లేదు. పలు దఫాలుగా కేవలం 12గంటలు మాత్రమే వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తున్నారు. అది కూడా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని విధంగా సరఫరా వేళలు ఉన్నాయి. దీంతో పంటలకు నీరందడం లేదు. కొద్దిరోజులుగా నిత్యం గంటలకొద్దీ అప్రకటిత కరెంట్‌కోతలు విధిస్తుండటంతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. కరెంటు ఎప్పుడొస్తుందో తెలీక రైతులు పొలాల వద్ద రేయిపగలు తేడా లేకుండా పడిగాపులు కాస్తున్నారు. కొంత కాలం క్రితం వరకు పగటిపూట మాత్రమే వ్యవసాయానికి కరెంట్ ఇవ్వగా.. కరెంట్‌లైన్లు ఇతర మరమ్మతుల పేరుతో ఎప్పుడుపడితే అప్పుడు గంటలకొద్దీ సరఫరాను నిలిపివేశారు. దాంతో పొలంలో తడిచిన పైరే మళ్లీ మళ్లీ తడవడం తప్ప ఉపయోగం లేకుండా పోయింది.

ప్రస్తుతం యాసంగిలో ఎక్కువమంది రైతులు వరి, మొక్కజొన్న వేయగా కొన్నిచోట్ల మిర్చి, ఇతర పంటలు కూడా సాగులో ఉన్నాయి. రోజుకు ఐదారు గంటలకు మించి వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేయడకపోవడం, అదీ ఒక సమయమంటూ ఉండకపోతుంటంతో పంటలు ఎండిపోతున్నాయి. దాంతో పంటలను బతికించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

పెల్లుబికిన రైతుల నిరసన..

సమయపాలన లేని విద్యుత్ సరఫరాపై ఆగ్రహం చెందిన రైతులు ఆదివారం ములకపాడు సబ్‌స్టేషన్ ఎదుట భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఏడీ డీఈతో ఫోన్‌లో రైతుల సమస్యను వివరించగా.. 4, 5 రోజుల్లో విద్యుత్ సరఫరా ఏ సమయానికి ఇవ్వగలం అనే దానిపై ఉన్నతాధికారులతో చర్చించి స్పష్టత ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ధర్నా నిర్వహించిన రైతుల్లో కల్లూరు వెంకటేశ్వరరావు, నోముల రామిరెడ్డి, రావులపల్లి పృథ్వీ, కురుసం ప్రసాద్ అమరవాది శంకర్, బొందల రాంబాబు, రాజు యలమంచి వంశీ కృష్ణ, కొడాలి లోకేష్ బాబు తదితరులున్నారు. కాగా, డీఈ చెప్పినట్లుగా త్వరలో విద్యుత్ కోతల సమస్య ఓ కొలిక్కి వచ్చేది రానిది చూడాల్సి ఉంది.

పంటలు ఎండిపోతున్నాయి..

గత కొన్ని రోజులుగా అనధికారికంగా కరెంట్ తీస్తున్నారు. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో అర్థం కావడం లేదు. దీంతో పంటకు నీరందించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇలానే మరో వారం పాటు కోతలను కొనసాగిస్తే పంట పూర్తిగా ఎండిపోయి నష్టపోతాం.

– రావులపల్లి పృథ్వీ, నర్సాపురం రైతు

ఇప్పటికే నష్టపోయాం..

వర్షాకాలంలో వచ్చిన గోదావరి వరదలకు పంటలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదలు తగ్గాక సాగుబడి చేపట్టి పంటలు చేతికందే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందజేసి రైతులను ఆదుకోవాలి.

– యలమంచి వంశీ, దుమ్ముగూడెం రైతు

వారం రోజుల్లో పరిస్థితి సర్దుకుంటుంది..

పవర్‌గ్రిడ్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వారం రోజుల్లో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంది. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడానికి కృషి చేస్తున్నాం.

– మోహన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ

జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ రాణిస్తుంది



మాట్లాడుతున్న సీతారాం నాయక్

భద్రాచలం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో రాణిస్తుందని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని రాఘవ నిలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షతను చూపుతోందని ఆరోపించారు. అందుకే కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీను స్థాపించారని, రానున్న ఎన్నికలలో ఆ పార్టీ పెను సంచలనాలకు కేంద్ర బిందువు కానుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనపై అన్ని రాష్ట్రాలలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ముంపు మండలాలు, గ్రామపంచాయతీల పేరుతో భద్రాచలం ఏజెన్సీకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగే పోరాటాలకు, ఉద్యమాలకు ప్రజలందరి మద్దతు ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలలో తన పాత్ర ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తిప్పన సిద్ధులు, నాయకులు అరికెల తిరుపతిరావు, మామిడి పుల్లారావు, మానె రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేయండి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ నుంచి గుర్రాయిగూడెం వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్ట్, రైల్వేలైన్ నిర్మాణాల నేపథ్యంలో భారీవాహనాల రాకపోకలతో రోడ్డంతా ఛిద్రమైనా అధికారులు పట్టించుకోలేదని, పైకి తేలిన కంకరరాళ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారని సీపీఎం మండల నాయకుడు మిరియాల మోహన్‌రావు ఆరోపించారు. ఈ ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఎస్‌కె.నాగుల్‌మీరా, అబ్దుల్ రహమాన్, జే రాము, ఎస్ వినోద్ బడుగు రాము పాల్గొన్నారు.

పీవైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

గుండాల: వైఎల్ మండల అధ్యక్షుడిగా తాటి రమేష్, కార్యదర్శిగా ఎనగంటి లాజర్‌ను ఆ సంఘం జిల్లా కార్యదర్శి పర్శక రవి తెలిపారు. గుండాల మండలంలోని చీమలగూడెంలో ఆదివారం జరిగిన 7వ పీవైఎల్ మహాసభలో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణాలో ప్రత్యేక ఉద్యమం జరిగిందని, ఈ ఉద్యమంలో 1400 మంది అమరులయ్యారని అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్..టతప్పాడని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్థలం కేటాయించాలి

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీ సమీపాన ఉన్న వైఎస్ఆర్ నగర్‌లో గౌతమ్ బుద్ధ మందిర నిర్మాణానికి, ఔషద మొక్కల పెంపకానికి స్థలం కేటాయించాలని కోరుతూ పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్ ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, జీవ కారుణ్యం లక్ష్యంగా నేటి ఆధునిక సమాజంలో బౌద్ధమత అవసరం ఎంతగానో ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేగా కాంతారావు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధమత అభిమానులు వి.శంకర్‌నాయక్, ఎం.కోటేశ్వరరావు, శివరామకృష్ణ, జె.నరేష్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, గోగులపూడి అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. దాంతో ఆలయాల దగ్గర భక్తుల సందడి నెలకొంది.

24 గంటలూ కరెంట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ములకలపల్లి: వ్యవసాయరంగానికి 24 గంటల పాటు కరెంటు ఇవ్వాలని తెలంగాణా రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వేసంగి పంటలకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతోందని వాపోయారు. అప్రకటిత కరెంటు కోతలతో పంటలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. సమావేశంలో సంఘ మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మీనర్సు, గడ్డం వెంకటేశ్వర్లు, గొగ్గెల ఆదినారాయణ, శ్రీరాములు, శ్రీదేవి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు వీరే..

అశ్వాపురం: ఖమ్మంలో జరిగిన నేషనల్ లెవల్ షోటో కాన్ కరాటే అండ్ కుంగుఫూ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆదివారం అశ్వాపురం, మణుగూరు విద్యార్థులు సత్తా చాటి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. అశ్వాపురానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ మురుగన్ శిక్షణతో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో మనోజ్ కుమార్, వైష్ణవి, శ్రీరామ్, సాయిఅక్షిత్, జాహ్నవి, ప్రియవర్శిని బంగారు పతకాలు సాధించారు. చరణ్, అక్షయ రజత పతకాలు, నాగేంద్ర, లహరి, మౌనిక, పావనశ్రీ కాంస్య పతకాలు సాధించారు. చాంపియన్‌షిప్‌లో నందిని, సంధ్య మహిళా ఇన్‌స్ట్రక్టర్లుగా వ్యవహరించారు.

పసుపు పూలమయం!



కనుచూపుమేర పసుపు వర్ణంలో కనిపిస్తున్న జనుము

దూరం నుంచి చూస్తే.. ఇదేదో పసుపుపచ్చని పూలతోట అనుకుంటారు. కానీ పూలతోట కాదు.. సాగులో ఉన్న జనుము పంట. అశ్వారావుపేట మండలం నందిపాడు అటవీ ప్రాంతంలో ఓ రైతు తన పొలంలో జనుము పంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ పంట చేనంతా కాపు దశలో ఉండగా, కనుచూపుమేర దాకా పసుపు వర్ణంలో కనిపిస్తోంది. ఇది చూసిన వారంతా పసుపు పూలమయంగా ఉందని అభివర్ణిస్తున్నారు. దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' కెమెరాలో క్లిక్‌మనిపించింది. – అశ్వారావుపేటరూరల్

పారిశ్రామిక అభివృద్ధితో మేలు



డ్రాతీసి టోకెన్ నంబర్ చూపిస్తున్న రేగా..

మణుగూరుటౌన్: పారిశ్రామిక అభివృద్ధి వల్ల ఎంతో మేలు కలుగుతుందని తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరు భద్రాద్రి పవర్ ప్లాంట్ రైల్వే లైన్ నిర్మాణంలో నిర్వాసితులైన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఇళ్ల నిర్మాణం కోసం లాటరీ పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో డ్రా తీసే కార్యక్రమం ఏర్పాటు చేయగా.. విప్ రేగా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంతంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో పారిశ్రామిక అభివృద్ధి సాధించగలదన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రాంత అభివృద్ధికి సహకరించిన నిర్వాసితులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మణుగూరు మండలంలోని 314 సర్వే నంబర్, రామానుజవరంలోని 853 సర్వే నంబర్లలో ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ వీరభద్రం, ఎంపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం



ఐటీసీ ఉన్నతాధికారులకు అవార్డును అందజేస్తున్న భద్రాచలం ఏఎస్పీ రోహిత్

భద్రాచలంఅర్బన్: రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ఆదివారం క్షయవ్యాధి బాధితులు, తలసేమియా, రక్తహీనతతో బాధపడుతున్న 75 మందికి ఉలెన్ బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందర్య రాజన్ ఉత్తమ సేవలందించిన సంస్థలు, సభ్యులకు మెడల్స్ అందించారు. ఆ మెడల్స్‌కు ఎంపికైన స్థానిక నాయకులు, సంస్థ ప్రతినిధులకు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎస్పీ రోహిత్ రాజ్ చేతులమీదుగా వాటిని అందజేశారు. బ్లడ్ బ్యాంక్ నిర్మాణం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షల తలసేమియా సామగ్రిని అందించిన సీతారాం నాయక్‌కు, రూ.40 లక్షలతో సామగ్రి అందజేసిన ఐటీసీ కర్మాగారం మేనేజర్, భద్రాచలం పేపర్ బోర్డు మహిళా సమితి వారికి, రూ.15లక్షలతో బ్లడ్ బ్యాంక్ నిర్మాణంలో సామగ్రి అందించిన జీవీ సుదర్శన్‌కు గోల్డుమెడళ్లు అందించారు. అలాగే పలు కార్యక్రమాలను రూపొందించిన డా.ఎస్ఎల్ కాంతారావు, జిల్లా కోఆర్డినేటర్ వై.సూర్యనారాయణ, జి. రాజారెడ్డి, టి.సిద్ధులకు గోల్డుమెడల్స్ అందించారు. అలాగే పి. దేశప్ప, డా.వై.భాను ప్రసాద్, జి.సుధకార్, లయన్ చావా లక్ష్మీనారాయణ లకు సిల్వర్ మెడల్స్ అందించారు. ఏఎస్పీ రోహిత్ రాజ్ వీరికి అవార్డులను అందజేస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో పాకాల దుర్గా ప్రసాద్, డా.విజయభారతి, ఎస్ఎస్పీ రామారావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పొంగులేటి విరాళం



దమ్మపేట: మసీద్ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న పొంగులేటి, జారే

దమ్మపేట: మండలంలోని పలు మందిరాలు, ఆలయాలు, చర్చిల నిర్మాణాలకు విరాళాలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఆదివారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని దమ్మపేట గ్రామంలోని మసీదుకు రూ.30 వేలు, అంకంపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి రూ.25 వేలు, అర్లపెంట గ్రామంలోని రామాలయానికి రూ.25 వేలు, బొల్లిగట్టు గ్రామంలోని చర్చికి రూ.20 వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలవగా.. ఆయన ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేల విరాళం అందజేశారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కందిమళ్ల రాంరెడ్డి, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, ఆవుల రవి, మానాది వెంకన్న, రాగం మల్లయ్య, నెహ్రూ, సామకూరి వెంకన్న, వంకా సత్యనారాయణ, దేపంగి వెంకటరమణ, కమటం శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

సీఎం, రేగాకు రుణపడి ఉంటాం..



ఎమ్మెల్యే రేగాను సన్మానిస్తున్న సర్పంచ్ మర్రి మల్లారెడ్డి

అశ్వాపురం: వేలమంది రైతుల చిరకాల కోరిక తీరుస్తూ సీతారామ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించే మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించినందుకు తుమ్మల చెరువు ఆయకట్టు రైతుల పక్షాన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఎమ్మెల్యే రేగా కాంతారావుకు రుణపడి ఉంటామని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేసేందుకు బీజీ కొత్తూరు గ్రామానికి వచ్చిన ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును ఆదివారం సర్పంచ్ మల్లారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేగా కాంతారావు పట్టుదల, కృషితోనే ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన వేగవంతంగా పూర్తి చేసి తుమ్మలచెరువుకు నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిద్రపోతున్న నిఘా నేత్రాలు



మండల కేంద్రంతో పాటు, మొండికుంట గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. నిఘా నేత్రాలు నిద్ర పోతుండటంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డవారు పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారు. గతంలో మండల కేంద్రంలో ప్రధాన సెంటర్, కూరగాయల మార్కెట్ ఏరియా, మొండికుంట గ్రామంలో ప్రధాన సెంటర్ వంటి పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి కొంత కాలం పని చేసినా తర్వాత వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిద్రావస్థలోకి వెళ్లాయి. ఎక్కడా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మొండికుంటలో ఇటీవల వరుస దొంగతనాలు జరిగినా దొంగలను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎక్కడ చూసినా పనిచేయడం లేదు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి మండల కేంద్రం, మొండికుంట గ్రామాల్లో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి నిఘా నేత్రాల నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. - అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాసరావు, అశ్వాపురం సీఐ
ఫోన్ నంబర్: 9440904282